నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మందుబాబులకు పాఠశాల శ్రుభం చేసే శిక్ష

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నిందితులు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోర్టు ఆదేశం

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 20 : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13 మందికి జిల్లా ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం శిక్ష కింద సామాజిక సేవ చేయాలని ఆదేశించినట్లు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మందమర్రి పట్టణంలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని, కోర్టు వీరికి రెండు రోజుల పాటు పాఠశాలను శుభ్రం చేయాలని శిక్ష విధించిందని తెలిపారు.

దాంపూర్ శివారులో పులి కలకలం

- అటవీ ప్రాంతంలో గేదెను చంపి తిన్న పులి
- మంచిర్యాల రేంజ్ అటవీశాఖ అధికారుల అలర్ట్

భీమారం, ఫిబ్రవరి 20 : భీమారం మండలం దాంపూర్ శివారు ప్రాంతంలో పులి కలకలం రేపుతున్నది. నెల రోజులుగా బెల్లంపల్లి నియోజకవర్గంలో సంచరించిన ఆడ పెద్దపులి.. నాలుగు రోజుల క్రితం నెన్నెల మండలంలోని అటవీ ప్రాంతంలోకి అడుగుపెట్టింది. కుష్నపల్లి అటవీ రేంజ్ పరిధిలోని రంగపేట బీట్‌లో గల చెర్లపల్లి, ఎల్లారం మీదుగా, బొప్పారం గ్రామ సమీపంలోని రంగపేట సెంట్రల్ నర్సరీ వద్దకు వచ్చింది. అక్కడ నుంచి భీమారం మండల శివారులోని దాంపూర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నది. దీంతో మంచిర్యాల అటవీశాఖ రేంజర్ రత్నాకర్‌రావు తమ సిబ్బందితో అప్రమత్తం అయ్యారు. రెండు రోజులుగా దాంపూర్ శివారు ప్రాంతంలో ప్రత్యేక టీంతో గస్తీ కాస్తున్నారు. దాంపూర్ శివారు ప్రాంతంలో పెద్దపులి ఓ గేదెను చంపి మొండం, తలను వేరు చేసింది. పులి కదలికలను ఎప్పటికప్పుడు అటవీశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ధర్మారం, రెడ్డిపల్లి, ఖాజీపల్లి, బూర్గుపల్లి, పోతన్‌పల్లి, ఆవుడంకు వెళ్లే ప్రయాణికులు భయంతో పణికిపోతున్నారు.

మీడియా సమావేశంలో పట్టుబడిన నిందితులతో వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్, అధికారులు

సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో
గంజాయి దందా

- మంచిర్యాలలో ముఠా గుట్టు రట్టు
- 22 మందిపై కేసు నమోదు
- 11 మంది అరెస్టు, పరారీలో మరో 11 మంది
- రూ.11.75 లక్షల విలువవైన 23.5 కిలోలు పట్టివేత
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన సీపీ

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 20 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాల ముసుగులో గంజాయి దందా చేస్తున్న ముఠాను పట్టుకున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రామగుండం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఐబీ చౌరస్తా ఏరియాలోగల ఎస్‌బీఐ కాంప్లెక్స్ సెల్లార్‌లో సోమ ప్రవీణ్‌కుమార్‌కు చెందిన వై ఇన్ఫో సొల్యూషన్స్ (సీసీ కెమెరాల షాప్) సంబంధించిన గోదాంలో గంజాయి నిలువ ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉన్న కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారించారు. అక్కడ తనిఖీ చేయగా కాటన్ బాక్స్‌లలో ప్యాక్ చేసి ఉన్న గంజాయిని గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన వారిలో మంచిర్యాలకు చెందిన ఇరుగురాళ్ల సతీశ్ కుమార్, మహ్మద్ సమీర్, భీమ అనుదీప్, మహమ్మద్ అబ్దుల్ ఉబేద్, అర్జున్ బాబురావు, మహ్మద్ అజీజ్, జాడి రాఘవేంద్ర స్వామి, గూడూరు రాము, ఎస్‌కే అథాహుర్, ఎస్‌కే సమీర్, మరో మైనర్ ఉన్నారని, మరో 11 మంది నిందితులైన సోమ ప్రవీణ్, తగరపు రాజు, తగరపు శృతి, తగరపు వినయ్, రామాలయం రాకేశ్, శ్రీధర్, మున్నీ, వికలాంగుడు (చింటూ), అల్మేకర్ శ్యామ్, క్వార్టర్ సాయి, సోహెల్ పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామమని సీపీ తెలిపారు. పట్టుబడిన గంజాయి 23.5 కిలోలు అని, దీని విలువ రూ.11.75 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ, రాఘవేంద్ర, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి మంచిర్యాల సీఐ ప్రమోద్, ఇన్‌స్పెక్టర్, టాస్క్‌ఫోర్స్ సీఐలు రాజ్‌కుమార్, రమేశ్, టాస్క్ ఫోర్స్ ఎస్ఐలు లచ్చన్న, ఉపేందర్, కిరణ్ కుమార్ ఉన్నారు.

పథకం రచించి.. చివరకు పోలీసులకు చిక్కి..

రాజీవ్‌నగర్‌కు చెందిన ఇరుగురాళ్ల సతీశ్‌కుమార్ కొనేళ్లుగా డ్రైవరుగా పని చేస్తున్నాడు. జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు. మంచిర్యాలలో సీసీ కెమెరాల బిజినెస్ చేసే తన ఫ్రెండ్ సోమ ప్రవీణ్‌కు గంజాయి అక్రమ రవాణా గురించి చెప్పాడు. ఇందుకు ప్రవీణ్ స్పందిస్తూ సీలేరు వద్ద తక్కువ ధరకు ఎండు గంజాయి దొరుకుతుందని, తను కూడా ఇది వరకు ఇక్కడికి తెచ్చి అమ్మినట్లు చెప్పాడు. అక్కడ గంజాయి పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి మంచిర్యాలకు తీసుకువచ్చి తన సీసీ కెమెరాల షాప్ గోదాంలో పెట్టాలని, అందరూ గ్రూప్‌గా ఏర్పడి ఎక్కువ ధరకు గంజాయి అమ్మాలని పథకం రచించారు. 2024 డిసెంబర్ చివరివారంలో ప్రవీణ్, సతీశ్ వీరికి తెలిసిన గంజాయి తాగే స్నేహితుల (ప్రస్తుతం కేసులు నమోదైన వారు)తో సమావేశమయ్యారు. ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరుకు వెళ్లి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముఠాను గుట్టురట్టు చేశారు.

చెత్త డంప్‌పై ఆగ్రహం

- బెల్లంపల్లి మున్సిపాలిటీ వాహనాలను అడ్డుకున్న పెద్దనపల్లి, దుబ్బగూడెం ప్రజలు
- ఎన్నిసార్లు వద్దన్నా వినారా అంటూ ఫైర్

కాసిపేట, ఫిబ్రవరి 20 : కాసిపేట మండలంలోని సోమగూడెం పాత టోల్ గేట్ శివారులో బెల్లంపల్లి మున్సిపాలిటీకి చెందిన చెత్తను డంప్ చేయడంపై పెద్దనపల్లి, దుబ్బగూడెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సోమగూడెం టోల్‌గేట్ వద్ద చెత్త వాహనాలను అడ్డుకొని ఆందోళన చేశారు. ఎన్ని సార్లు వద్దన్నా ఎందుకు చెత్త తీసుకొస్తున్నారని, అనుమతులెవరిస్తున్నారని నిలదీశారు. 20 రోజులుగా ఇదే తంతు సాగుతుందని, ఎన్నిసార్లు అడ్డుకున్నా మారడం లేదంటూ మండిపడ్డారు. ఆందోళనలు చేసినప్పుడు వెళ్లిపోవడం, ఆపై మళ్లీ రావడం చేస్తున్నారని చెప్పారు. భారీగా చెత్త వేయడం వల్ల అనేక రోగాలు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు తిరిగి వెళ్లిపోవాలని, మళ్లీ రావద్దని, అనుమతులు తీసుకొని రావాలని, అప్పుడు ఆ అధికారి దగ్గరికి వెళ్లి తేల్చుకుంటామని గ్రామస్తులు స్పష్టం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి శాంతింపజేశారు. చెత్త వాహనాలను తిరిగి పంపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెండె నవీన్, గోనెల శ్రీనివాస్, పెద్దనపల్లి, దుబ్బగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

సోమగూడెం టోల్‌గేటు వద్ద చెత్త వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

నాడు అద్భుతం.. నేడు అస్తవ్యస్తం..

పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించని కాంగ్రెస్ సర్కారు

- ప్రత్యేక అధికారుల పాలనకు ఏడాది పూర్తి
- పడకేసిన పారిశుధ్యం.. ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు..
- నిర్వహణ లేని సెగ్రిగేషన్ షెడ్లు, ట్రాక్టర్లు
- ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు
- ఉమ్మడి జిల్లాలో ఏ గ్రామంలో చూసినా ఇదే దుస్థితి

మంచిర్యాల, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : యేడాది క్రితం వరకు పచ్చని పల్లె ప్రకృతి వనాలు, ఊరికో ట్రాక్టర్, చెత్త సెగ్రిగేషన్ షెడ్లు, ఎక్కడికి వెళ్లినా అద్దంలా మెరిసే రహదారులు.. ఇదీ కేసీఆర్ పాలనలో గ్రామాల పరిస్థితి. ప్రతినెలా పంచాయతీల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీలను పరిశీలించి అవార్డులు ప్రకటిస్తే.. అందులో పన్నెండు అవార్డులు మన పల్లెలకే వచ్చాయి. గ్రామాలంటే తెలంగాణలో ఉన్నట్లు ఉండాలంటూ.. అద్భుతమైన పల్లె పాలనకు కేసీఆర్ సర్కారు నిదర్శనం అంటూ యావత్ దేశం కీర్తించింది. ఇవన్నీ చేస్తూనే ఏడాదికోసారి పల్లె ప్రగతి కార్యక్రమంతో ప్రాణమంతా పల్లెలపైనే పెట్టి కేసీఆర్ సర్కారు పని చేసింది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పరిస్థితి తారుమారైంది. గ్రామ పంచాయతీలకు వచ్చే నెల వారి నిధులు ఆగిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు నిలిచింది. దీంతో పాలన కూనారిల్లింది. నిధులు లేక, నిర్వహణ పట్టించుకునే నాథుడు లేక పల్లె ప్రకృతి వనాలన్నీ ఎండిపోయాయి. పచ్చదనంతో కళకళలాడిన ప్రకృతి వనాల్లో ఇప్పుడు మొండి మొక్కలు కనిపిస్తున్నాయి. నిర్వహణ లేక సెగ్రిగేషన్ షెడ్లు పాడైపోతున్నాయి. కిస్తీలు కట్టలేక గ్రామ పంచాయతీల్లోని ట్రాక్టర్లు మూలకు పడుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏ పల్లె చూసినా దాదాపు ఇదే దుస్థితి కనిపిస్తున్నది.

పర్యవేక్షణ లోపం.. కార్యదర్శిపైనే భారం..

పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసి ఏడాది దాటింది. కులగణన మరోసారి చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఎన్నికలు వాయిదా పడనున్నాయి. ఇప్పటికే ఏడాది కాలంలో పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. కాకపోతే ఒక్కో అధికారికి మూడు, నాలుగు గ్రామాలు అప్పగించడంతో పనిభారం ఎక్కువైంది. మండలాధికారులకు బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ లోపించింది. మరోవైపు మండల పరిషత్‌లకు జిల్లా అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. దీంతో గ్రామ, మండల స్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు. సమావేశాలు, సంతకాలకే పరిమితమవ్వాల్సిన దుస్థితి నెలకున్నది. దీనికి తోడు నిధుల లేమి, పర్యవేక్షణలోపం, పాలన వ్యవహారాలు చూసేవారు కరవై జనాలు అవస్థలు పడుతున్నారు. నిధులు రాకపోవడం, ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శుల పైనే పడుతున్నది. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ట్రాక్టర్లు, ట్యాంకర్ల మెయింటెనెన్స్, తాగునీటి పథకాలకు మరమ్మతు, పైపులైన్ లీకేజీలు, వీధి దీపాలకు మరమ్మతులు అన్ని పనులకు కార్యదర్శి బేజుల్లో నుంచి సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తున్నది. నిధుల కొరతతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం కష్టంగా మారింది. ట్రాక్టర్, ట్యాంకర్, పల్లె ప్రకృతి వనాలు వీటన్నింటని సొంత డబ్బులతో చూసుకోలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులే వాపోతున్నారు. ఎన్నికల విషయం దేవుడెరుగు ముందు పంచాయతీలకు నిధులు ఇవ్వాలంటూ వేడుకుంటున్నారు.

గ్రామాలను వేధిస్తున్న సమస్యలు..

- నిధులు లేక పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాల నిర్వహణ కుంటుపడింది. పల్లె ప్రకృతి వనాల్లో ఏర్పాటు చేసిన బోర్డులు తప్ప మొక్కలు కనిపించడం లేదు.
- క్రీడా ప్రాంగణాల నిర్వహణ సరిగా లేదు. పలుచోట్ల క్రీడాప్రాంగణాలను దున్ని సాగు చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాల్లో అమర్చిన పరికరాలు తుప్పుపట్టి పాడైపోతున్నా పట్టించుకునే నాథుడు లేడు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో గత ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లు, ట్యాంకర్లకు కిస్తీలు కట్టలేకపోతున్నారు.
- పారిశుధ్య నిర్వహణ గగనంగా మారింది. గతంలో పల్లెలకు పంపిణీ చేసిన చెత్త డబ్బాలు పాడైపోగా కొత్తవి కొనలేని దుస్థితి. చెత్త సేకరించేందుకు ట్రాక్టర్లకు డీజిల్ పోయించే పరిస్థితి లేదు. దీంతో రోడ్లపై ఎక్కడిచెత్త అక్కడే కనిపిస్తున్నది.
- తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసే సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ లేదు. దీంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయి.
- పాడైపోయిన వీధి దీపాల స్థానంలో కొత్తవి బిగించలేని పరిస్థితి.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

తాగు నీరందించాలని
ఖాళీ బిందెలతో ధర్నా

మిషన్ భగీరథ పైపులైన్ తాత్కాలికంగా తొలగింపు..

నీటి సరఫరా నిలిపివేత - అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

దహెగాం, ఫిబ్రవరి 20 : తాగు నీరందించాలని కోరుతూ దహెగాం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన మహిళలు గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ కాలనీకి పది రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అందవెల్లి సమీపంలోని పెద్దవాగుపై ఉన్న వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున మిషన్ భగీరథ పైపులైన్‌ను తాత్కాలికంగా తొలగించి నీటి సరఫరా నిలివేశారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుంది

నస్పూర్, ఫిబ్రవరి 20 : జిల్లాలో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యే వరకూ ప్రక్రియ కొనసాగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్‌కుమార్ దీపక్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ సర్వర్ డౌన్ కారణంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేయడం జరిగిందని, ప్రస్తుతం సర్వర్ రిస్టోర్ ప్లానింగ్ ప్రక్రియ కొసాగుతుందని తెలిపారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం వివరాల ప్రకారం కొనుగోళ్లు చేపట్టి సంబంధిత రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. టోకెన్ పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయడం జరుగుతుందని, రైతులు సహకరించాలని తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలి

లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 28లోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏడు మున్సిపాలిటీల్లో 39,512 దరఖాస్తులు రాగా, 9,500 నిషేధిత భూములుగా గుర్తించడం జరిగిందని, ప్రాథమిక స్థాయిలో రెవెన్యూ, నీటి పారుదల శాఖ పరిధిలో 7444 దరఖాస్తులు

- పత్తి రైతులు ఆందోళన చెందవద్దు
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

కార్పొరేషన్ కార్యాలయంలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఉన్నాయని, రెండో స్థాయిలో పట్టణ ప్రణాళిక విభాగం పరిధిలో 3,790 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. 3745 ఆమోదించగా, 130 మంది లబ్ధిదారులు రుసుం చెల్లించడం జరిగిందని, 3615 మంది చెల్లించాల్సి ఉందన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 20 : జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ఐబీ చౌరస్తాలో కొనసాగుతున్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణాలను ఆకస్మికంగా సందర్శించారు. పలు సూచనలు చేశారు.

ప్రజాపాలన దరఖాస్తులపై ఆరా

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 20 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్, కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ కుమార్ దీపక్ సందర్శించారు. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరు, ఇంటింటీ రీసర్వే, పన్నుల వసూళ్లు, తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఆయా విభాగాల్లో చేపడుతున్న పనుల గురించి ఆరాతీశారు. కార్పొరేషన్‌గా మారిన తర్వాత ఉద్యోగులు మరింత బాధ్యతగా పనిచేయాలని, ఎలాంటి అనుమానాలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

తాగు నీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

మంచిర్యాల కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 20 : వేసవి సమీపిస్తున్నందున జిల్లా ప్రజలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో తాగునీటి ప్రణాళిక, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల పనుల ప్రారంభం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీకి మిషన్ భగీరథ ద్వారా నీరు అందించాలని, పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టాలని, మోటర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఏజెన్సీ మండలాలైన తిర్యాణి, లింగాపూర్, జైనూర్, కెరమెరి, సిర్పూర్ (యు)లలోని ఆవాస ప్రాంతాలకు తాగునీరందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి గ్రామపంచాయతీ నుంచి 100 రోజులకు తక్కువ కాకుండా పని కల్పించాలని, ఆ దిశగా ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.